క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చిలకలపూడి(మచిలీపట్నం): నగరంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎం. భాస్కరరావు గురువారం తెలిపారు. గొడుగుపేట, రాజుపేట, ఖోజ్జిల్లిపేట, ఆజాద్ రోడ్డు, నూరుద్దీన్‌పేట ప్రాంతాల్లో ఉదయం 6 నుంచి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని వివరించారు.

పేదలకు అన్నదానం



నాగాయలంక: స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో నిత్యాన్నదాన కమిటీ ఆధ్వర్యంలో గురువారం దాతల సహకారంతో 60 మంది నిరుపేద వృద్ధులు, దివ్యాంగులకు అన్నదానం చేశారు. గ్రామస్తులు ఉప్పల వెంకటేశ్వరరావు, రుక్మిణాంబ దంపతులు ఆర్థిక సాయం అందించారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్‌లో విద్యార్థుల ప్రతిభ



పెడన: పట్టణంలోని బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతూ పలువురు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరై అత్యధిక మార్కులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర రామారావు అన్నారు. ఎంపీసీలో పేరక సాయి 470 మార్కులకు 452 మార్కులు సాధించిందన్నారు. గుడిమెట్ల రామ్‌కార్తీక్‌కు 437 మార్కులు వచ్చాయన్నారు. బైపీసీలో 440 మార్కులకుగాను వాసా ఝాన్సీ 285, సీఈసీలో షేక్ మయిమున్నీసా 500 మార్కులకు 362 మార్కులు వచ్చాయని చెప్పారు. వృత్తి విద్యా కోర్సులలో ఓఎస్‌లో మధురేఖ 500లకు 457 మార్కులు సాధించారని తెలిపారు. అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులను గురువారం అభినందించి ఫైళ్లను అందజేశారు. అధ్యాపకులు పేరిశెట్టి నాగ రవి, సైదా, శ్రీనుబాబు, నిరంజన్, గంగాధర్, ఆనందరావు, గిరి, రవికుమార్ పాల్గొన్నారు.

వరి విత్తనాల షాపులు తనిఖీ



ఘంటసాల(అవనిగడ్డ): 2023 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు మేలైన విత్తనాలు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఘంటసాల ఏఓ కె. మురళీకృష్ణ తెలిపారు. ఘంటసాల మండలంలోని పలు విత్తనాల షాపులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. కోర మాండల్ షాపులోని వరి విత్తనాలు, లైసెన్స్, సరఫరా రశీదులు, నాణ్యతా ప్రమాణాలు, బిల్ పుస్తకాలు, ధరలు, నిల్వలను ఆయన పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విత్తనాల షాపులను తనిఖీ చేశామని చెప్పారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మినా, రశీదులు ఇవ్వకపోయినా, నిబంధనలు పాటించక పోయినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలన్నారు.

దిశ యాప్‌పై అవగాహన



మోపిదేవి: దిశ యాప్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ సీహెచ్ పద్మ అన్నారు. మోపిదేవి నుంచి పెదప్రోలు జాతీయ రహదారిలో వాహనదారులు, ప్రయాణికులకు దిశయాప్‌పై గురువారం అవగాహన కల్పించారు. గ్రామ సచివాలయాల మహిళా పోలీసులతో కలిసి ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లలో వెళ్లే ప్రయాణికులకు దిశ యాప్‌పై అవగాహన కల్పించడంతో పాటు వారి స్మార్ట్‌ఫోన్లలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేశారు.

పేరంటాలమ్మ హుండీ కానుకల ఆదాయం రూ.5.45 లక్షలు

రామవరప్పాడు: స్థానిక శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో హుండీ కానుకలను గురువారం లెక్కించగా రూ.5,45,007 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు. కార్యక్రమాన్ని దేవదాయ శాఖ అధికారి కె.వి అనురాధ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా లోకేశ్వరి మాట్లాడుతూ మూడు నెలలకు అమ్మవార్లకు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా ఈ ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో సాయి సేవాదళ్ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

- సీఎం జగన్ చర్యలతో మంచి ఫలితాలు
- ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లకు పోటీ పడే రోజులు రానున్నాయి
- విద్యార్థులను ప్రోత్సహించేందుకే జగనన్న ఆణిముత్యాలు
- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



జిల్లా ఫస్ట్ ర్యాంకర్ ప్రేమ్‌సాయి, తండ్రి శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, డీఈఓ తాహెరా సుల్తానా



బందరులో పదో తరగతిలో 582 మార్కులు సాధించిన విద్యార్థిని మహాలక్ష్మికి నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేసిన దృశ్యం

అవనిగడ్డ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలతో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో సీటు కోసం పోటీపడే రోజులు రానున్నాయని చెప్పారు. నియోజకవర్గ స్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం జరిగింది. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ డ్రాపవుట్స్‌ని తగ్గించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని చెప్పారు. నాడు–నేడు, అమ్మ ఒడి, ఇంగ్లిష్ మీడియం విద్య, ట్యాబ్స్ పంపిణీ తదితర కార్యక్రమాల వల్ల కార్పొరేట్ స్కూల్స్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారన్నారు. అవనిగడ్డ ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ఆకుల ప్రేమ్ సాయి రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించడమే ఇందుకు నిదర్శనమన్నారు. విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి లాంటి సీఎంలు ప్రతి రాష్ట్రంలో ఉంటే ప్రపంచ దేశాలు మన విద్యా విధానం అమలు కోసం పోటీపడతాయని చెప్పారు.

వినూత్న విధానాలతో విద్యార్థులకు ప్రోత్సాహం..

విద్యార్థులను ప్రోత్సహించేలా ప్రభుత్వం వినూత్న విధానాలతో ముందుకు వెళుతోందని డీఈఓ తాహెరా సుల్తానా అన్నారు. జగనన్న ఆణిముత్యం కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల్లో రానున్న రోజుల్లో మరింత మంది ర్యాంకర్లు తయారవుతారని చెప్పారు. తమ పిల్లలు ఎలాంటి చదువులు కావాలని కోరుకుంటున్నారో అంతకంటే మెరుగైన విద్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని చెప్పారు. ఉపాధ్యాయులు ఇంకా బాగా పనిచేస్తే ప్రభుత్వానికి మరింత మంచి పేరు వస్తుందన్నారు. అనంతరం స్టేట్ థర్డ్, జిల్లాలో ఫస్ట్ ర్యాంకు సాధించిన ప్రేమ్‌సాయితో పాటు నియోజకవర్గంలో రెండు, మూడు ర్యాంకులు సాధించిన భావిశెట్టి కావ్యశ్రీ, మేడికొండ మోనాతో పాటు ఇంటర్‌లో మొదటి మూడు ర్యాంకులు సాధించిన ఎం. సోనాలి, మానికలక్ష్మీ, పేరుబోయిన హరిత, బాల దుర్గా స్వరూప్, హెచ్‌ఎం, ప్రిన్సిపాల్స్‌ని ఎమ్మెల్యే సింహాద్రి, డీఈఓ తాహెరా సుల్తానా నగదు ప్రోత్సాహం, మెమెంటోలు అందించి ఘనంగా సత్కరించారు. అవనిగడ్డ ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ దిడ్ల కిరణ్, ఎంఈఓలు ఎన్. శివశంకరరావు, టీపీఎం రాందాస్, కె రాజ్‌కుమార్, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జిల్లా కన్వీనర్ గుర్రం బసవయ్య, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి పునరుజ్జీవం తీసుకువచ్చిన సీఎం వైఎస్ జగన్

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యారంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పునరుజ్జీవం తీసుకు వచ్చారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన ఎనిమిది మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహం, ప్రశంసాపత్రం అందించి వారి తల్లిదండ్రులను సత్కరించారు. గురువారం స్థానిక లేడియాంప్తిల్ కళాశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో పేర్ని కిట్టు మాట్లాడుతూ విద్యారంగంలో జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిన మార్పులను, విద్యార్థులను సాధించిన ఫలితాలను వివరించారు. ఎంయూడీఏ చైర్‌పర్సన్ బొర్రా దుర్గాభవాని, ఎంఈఓ దుర్గాప్రసాద్, బందరుకోట మునిసిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు టీవీ రఘుకాంత్ మాట్లాడారు. కార్యక్రమంలో 13వ డివిజన్ కార్పొరేటర్ గాజుల శ్రీదేవి, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గాజుల భగవాన్, పలు డివిజన్ల కార్పొరేటర్లు, ప్రధానోపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

రూ.1.15లక్షల నగదు ప్రోత్సాహం వచ్చింది



పదో తరగతిలో మంచి ర్యాంకులు సాధించిన వారికి ప్రభుత్వం నగదు ప్రోత్సాహం అందించడం చాలా సంతోషంగా ఉంది. స్టేట్ థర్డ్ ర్యాంకు, జిల్లాలో ఫస్ట్‌ర్యాంకు, నియోజకవర్గంలో ఫస్ట్‌ర్యాంకు ద్వారా నాకు రూ.1.15 లక్షలు నగదు బహుమతి లభించింది. ఇలాంటి కార్యక్రమాలు మిగిలిన విద్యార్థులకు ఎంతో ప్రేరణగా ఉంటుంది.

– ఆకుల ప్రేమ్‌సాయి, జిల్లా ఫస్ట్ ర్యాంకర్, అవనిగడ్డ

పోటీతత్వం పెరుగుతుంది



ప్రభుత్వం చాలా మంచి కార్యక్రమం చేపట్టింది. కార్పొరేట్ స్కూల్స్‌లో ఇలాంటి కార్యక్రమాలు జరిగేవి. ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పోటీతత్వం పెరుగుతుంది.

– భావిశెట్టి కావ్యశ్రీ, జిల్లా సెకండ్ ర్యాంకర్

చాలా సంతోషంగా ఉంది



నియోజకవర్గంలో థర్డ్ ర్యాంక్ రావడం చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో ర్యాంకులు వచ్చిన వారికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహకాలు అందించడం వల్ల మరింత మంది పోటీ పడి చదువుతారు. తద్వారా మరింతమంది ర్యాంకులు సాధిస్తారు.

– మేడికొండ మోనా, జిల్లా థర్డ్ ర్యాంకర్

ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



బ్రోచర్ అందజేసి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

అశ్వరావుపాలెం(అవనిగడ్డ): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు పారదర్శకంగా ప్రతి గడపకు చేరుతున్నాయని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండల పరిధిలోని అశ్వరావుపాలెంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని పలు గృహాలను సందర్శించి ప్రభుత్వ పథకాలను వివరించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి పాలన అందిస్తున్నారని చెప్పారు. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు సచివాలయాల ఏర్పాటు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని చెప్పారు. ఈ సందర్భంగా సర్పంచ్ పి. లంకమ్మ ప్రసాద్ గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, గ్రామ కన్వీనర్ దాసినేని భాగ్యరాజ్, సచివాలయ కన్వీనర్ దాసినేని గోపాలకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులకు పెరుగుతున్న ఆదరణ

విద్యా కానుక కిట్ల పంపిణీలో ఎంపీపీ వాణి



జగనన్న విద్యా కానుక కిట్లను అందజేస్తున్న ఎంపీపీ వాణి తదితరులు



చల్లపల్లిలో జగనన్న విద్యా కానుక కిట్లు అందిస్తున్న జెడ్పీటీసీ కల్యాణి



సంగమూడి ఉన్నత పాఠశాలలో కిట్లు అందిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

పెడన: ప్రభుత్వ బడులకు ఆదరణ పెరిగిందని, ప్రభుత్వ బడుల్లో సీట్ల కోసం పోటీపడుతుండటం ఇందుకు నిదర్శనమని ఎంపీపీ రాజులపాటి వాణి అన్నారు. గురువారం ఆమె మండలంలోని చెన్నూరు, చేవేంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. సీఎం జగన్ మామయ్య ప్రభుత్వ బడులను అభివృద్ధి చేసి సకల సౌకర్యాలు కల్పించారని, వీటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. నాణ్యమైన విద్యతోపాటు విద్యార్థులకు పౌష్టికాహారం కూడా అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజులపాటి అచ్యుతరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు, ఎంపీటీసీ అంకెం గిరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు యర్రంశెట్టి శివ, పాఠశాల హెచ్‌ఎం సౌజన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకులంలో విద్యా కానుక కిట్ల పంపిణీ

చల్లపల్లి: చల్లపల్లి నారాయణరావు నగర్‌లోని ఎస్సీ బాలికల గురుకుల కళాశాలలో గురువారం జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ రాజులపాటి కల్యాణి ముఖ్య అతిథిగా విచ్చేసి జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి పేదల విద్యా ప్రగతికి అమ్మ ఒడి, నాడు–నేడు, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారం, అల్పాహారం అందిస్తున్నారని చెప్పారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, పథకాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు రాజులపాటి శివప్రసాద్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పేద పిల్లలకు ఉన్నత చదువులే లక్ష్యం

కృత్తివెన్ను: పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారి పిల్లలకు ఉన్నత చదువులు, ఉత్తమ కొలువులు ఇప్పించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి అన్నారు. గురువారం సంగమూడి ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తోందని వివరించారు. ఏఎంసీ చైర్మన్ గంగాధర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకట్రాజు, నాయకులు వి. బాబూరావు, కె. వాసు పాల్గొన్నారు.

రైతులకు జగన్ ప్రభుత్వం అండగా ఉంటుంది

ఎంపీపీ గరుడప్రసాద్



రైతులకు వరి విత్తనాలు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కృత్తివెన్ను: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అనేక పథకాలు అమలు చేస్తూ అండగా నిలుస్తున్నారని ఎంపీపీ కూనసాని గరుప్రసాద్ అన్నారు. గురువారం సీతనపల్లి సచివాలయంలో రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న వరి విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. రైతు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కిలో రూ. 5 సబ్సిడీపై ఖరీఫ్‌కు గాను వరి విత్తనాలను అందిస్తోందన్నారు. ప్రస్తుతం బీపీటీ 5204, ఎంటీయూ 1061 విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ జెన్నీ కోరారు. జెడ్పీటీసీ మైల రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి గంగాధర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకట్రాజు, వ్యవసాయ శాఖ మండల చైర్మన్, జిల్లా బోర్డు సభ్యులు, వి. బాబూరావు, పి. నాని, కృత్తివెన్ను పీఏసీఎస్, ఆర్‌బీకే చైర్మన్‌లు కె. లక్ష్మాజీ, కె. కొండ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

బెల్ జీఎం జితేంద్ర సింగ్



రక్తదానం చేసిన ఉద్యోగిని అభినందిస్తున్న జీఎం జితేంద్ర సింగ్

మచిలీపట్నంటౌన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్) జనరల్ మేనేజర్ జితేంద్రసింగ్ అన్నారు. స్థానిక బెల్ కంపెనీ ఆవరణలో గురువారం ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది సుమారు 90 మంది రక్తదానం చేశారు. జిల్లా సర్వజన ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని జీఎం ప్రారంభించి మాట్లాడారు. రక్తదానంతో ప్రాణాలు నిలుపుతూ జీవితాన్ని ప్రసాదించే భాగ్యం రక్తదాతలకు దక్కుతుందన్నారు. రక్తదానం చేయడాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని చెప్పారు. రక్తదానం చేసిన బెల్ సిబ్బంది, ఉద్యోగులను అభినందించారు. సర్వజన ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్ అధికారులు గీతావాణి, రాయపరెడ్డి, సునీత, హిమబిందు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు డాక్టర్ హనుమంతయ్య, బాలాజీ, రాం బాలాజీ, హనుమాన్ బాలాజీ, శంకర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమ పూజలు



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

కోడూరు: మాచవరం గ్రామంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని రామాలయం వద్ద గురువారం ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. సీతారామచంద్రస్వామి వార్లకు పూజలు చేసి, ప్రత్యేక అలంకారంలో తీర్చిదిద్దారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ మహిళలు కుంకుమ పూజలు చేశారు. టీటీడీ ధర్మప్రచార జిల్లా సభ్యుడు ఆళ్ల జయశంకర్, సబ్ డివిజన్ కన్వీనర్ ఎస్.సుబ్బారావు, మండల కన్వీనర్ వెంకటేశ్వరరావు, మహిళా కన్వీనర్ అప్పికట్ల నాంచారమ్మ పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుకు గోల్డ్ కాయిన్ బహూకరణ



పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలుకు చెందిన పాల ఉత్పత్తిదారుడు బాసు శ్రీనివాసరావు కుమారుడు సాయికృష్ణ వివాహం గురువారం జరిగింది. సాయికృష్ణకు కల్యాణమస్తు పథకం కింద కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు నాదెళ్ల భవానీ శంకర ప్రసాద్ గోల్డ్‌కాయిన్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బోర్డు డైరెక్టర్ వేమూరి సాయి వెంకట రమణ, పామర్రు పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ చిట్టూరి దామోదర కృష్ణ, గోపీనాథ్, రూట్ ఏఎంపీఓ ఎం. వరప్రసాద్, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

ఉంగుటూరు: భూసార పరీక్షలతో భూమిలోని పోషకాల లేమిని తెలుసుకుని, వాటికి అనుగుణంగా సాగు చేస్తే అధిక దిగుబడులు పొందొచ్చని వ్యవసాయశాఖ అధికారి వి.హరీష్‌కుమార్ తెలిపారు. మండలంలో జరుగుతున్న మట్టి నమూనా సేకరణను ఏఓ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో గ్రామ వ్యవసాయ సహాయకులు రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి ఆర్బీకేలో వివరాలను నమోదు చేస్తున్నారని చెప్పారు. మట్టిని ల్యాబ్‌లో పరీక్షించిన తరువాత నేరుగా రైతు ఫోన్‌లోకి వివరాలు పంపడంతోపాటు సాయిల్ హెల్త్ కార్డులు అందజేస్తారని వివరించారు. మట్టి పరీక్షల ఫలితాల అనుగుణంగా పోషకాలను అందజేయడం వలన రసాయన ఎరువుల ఖర్చులు తగ్గి అధిక పంట దిగుబడులు వస్తాయన్నారు. రైతులు పొలాల్లో మట్టి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆర్బీకేలో గ్రామ వ్యవసాయ సహాయకులు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో ఏఈఓ దుర్గానాగేశ్వరరావు, వీఏఏలు పాల్గొన్నారు.

చెరువు పూడిక తీత పనులు ప్రారంభం



చెరువు పూడికతీత పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీమోహన్

గన్నవరం: స్థానిక కోనాయి చెరువు పైలెట్ ప్రాజెక్ట్ పక్కనే ఉన్న తొండం గట్టు చెరువు పూడికతీత పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. తొలుత చెరువు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న గ్రామ జనాభా అవసరాలకు అనుగుణంగా తాగునీటి వనరులను మెరుగుపర్చుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే 18 ఎకరాల విస్తీర్ణంలోని పానకాలు చెరువులో పూడికతీత పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం తొండం గట్టు, ఊర చెరువులో కూడా పూడికలు తీసి పోలవరం కాలువ నుంచి గోదావరి నీటితో నింపనున్నట్లు చెప్పారు. తద్వారా భూగర్భ జలాలు పెరగడంతో పాటు ఈ చెరువుల్లోని నీటిని తాగునీటి సరఫరాకు వినియోగించనున్నట్లు తెలిపారు. తొండం గట్టు చెరువులో పూడికతీసిన మట్టిని పరిసర గ్రామాల ప్రజలు మెరక పనులకు వినియోగించుకోవాలని కోరారు. ఏఎంసీ చైర్‌పర్సన్ రామిశెట్టి అంజనీకుమారి, ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఉప సర్పంచ్ పాలడుగు నాని, ఎంపీటీసీ సభ్యులు మద్దినేని వెంకటేశ్వరరావు, పడమట రంగారావు, ప్రభుత్వ ఆస్పత్రి కమిటీ చైర్మన్ మన్నే సుందరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్ష, కన్వీనర్లు పాల్గొన్నారు.

మెరుగైన విద్యకు కృషి

కంకిపాడు: చిన్నారులకు మెరుగైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నామని ఐసీడీఎస్ సీడీపీఓ కె.బి. సుకన్య అన్నారు. 8వ అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య పూర్తి చేసుకున్న చిన్నారులకు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను గురువారం అందించారు. ప్రజలను భాగస్వామ్యం చేయటంపై అవగాహన కల్పించారు. కె.బి.సుకన్య మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట పాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్య అందుతుందన్నారు. విద్యతో పాటుతో పౌష్టికాహారాన్ని ప్రభుత్వం సమర్థంగా అందిస్తోందన్నారు. పౌష్టికాహార లోప నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రైతుల సమస్యలపై పోరాడిన గొర్రెపాటి

ఘంటసాల(అవనిగడ్డ): స్వాతంత్ర్య సమరయోధుడు, కిసాన్‌నేత దివంగత గొర్రెపాటి వెంకట సుబ్బయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఘంటసాల పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో బుద్ధప్రసాద్ గొర్రెపాటి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలపై గొర్రెపాటి పోరాడారని కొనియాడారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం పరిధిలోని 14 మంది అభ్యుదయ రైతులను ఘనంగా సత్కరించారు.

సముద్రంలో గల్లంతైన యువకుడు మృతి

కోనేరుసెంటర్(మచిలీపట్నం): సముద్రంలో గల్లంతైన యువకుడు మృతి చెందాడు. అతని మృతదేహాన్ని బంటుమిల్లి మండలం ఇంతేరు గ్రామ సమీపంలో పోలీసులు గుర్తించారు. బందరు మండలం గోపువానిపాలెం గ్రామానికి చెందిన మేరుగు హేమంత్ (25) ఆటోడ్రైవర్‌గా జీవిస్తున్నాడు. గత ఆదివారం స్నేహితులతో కలిసి మంగినపూడి బీచ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసేందుకు వెళ్లాడు. స్నేహితులతో కలిసి సరదాగా సెల్ఫీ దిగుతున్న సమయంలో హేమంత్ ప్రమాదవశాత్తు సముద్రంలో పడిపోయాడు. అతడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోయింది. ఐదు రోజుల తర్వాత గురువారం హేమంత్ మృతదేహం ఇంతేరు సమీపంలోని సముద్రపు ఒడ్డుకు కొట్టుకు వచ్చింది. విషయం తెలుసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం హేమంత్ మృతదేహాన్ని మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి తరలించారు.

ఉపాధి పనుల్లో క్షేత్ర స్థాయి తనిఖీలు

కోసూరువారిపాలెం(మోపిదేవి): కోసూరువారిపాలెంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన వివిధ పనులపై క్షేత్ర స్థాయిలో సామాజిక తనిఖీలు నిర్వహించారు. సర్పంచ్ కోసూరు అనూష అధ్యక్షతన గురువారం జరిగిన కార్యక్రమంలో డీఆర్పీ జి.పూర్ణబాబు మాట్లాడుతూ 2022 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 మార్చి 31 మధ్య కాలంలో గ్రామ పంచాయతీ పరిధిలో జరిగిన వివిధ పనులపై మూడు రోజుల పాటు క్షేత్ర స్థాయిలో సిబ్బంది తనిఖీలు చేసిందని పనుల వివరాలు చదివి వినిపించారు. ఎంపీటీసీ సభ్యుడు ననకా వెంకట రాజేష్‌బాబు, ఎస్ఆర్పీ టి. నందిని, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉప్పాల వెంకటేశ్వరరావు, ఎన్ఆర్ఈజీఎస్ సూపర్‌వైజర్ మజ్ను పాల్గొన్నారు.